



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 283 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 31-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00



## ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

- వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ
- అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత

న్యూఢిల్లీ, -
నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం,

-మిగతా 2 లో



## మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

- రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి,ప్రధాని
- మహాత్ముడికి నివాళి అర్పించిన చంద్రబాబు

న్యూఢిల్లీ -
మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి.

-మిగతా 2 లో

# కేసీఆర్‌కు సిట్ షాక్

## మరోమారు నోటీసులు జారీ

- ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ
- నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి
- ఆదివారం 3గంటలకు విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీస్
- న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు ఇచ్చిన సిట్



హైదరాబాద్,- జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) : ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్ ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు.

-మిగతా 2 లో




## రేవంత్‌కు.. హార్వర్డ్ సర్టిఫికెట్

- యూనివర్సిటీలో పొలిటికల్ కోర్సు పూర్తిచేసిన సీఎం..
- ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్
- ఐదు రోజుల పాటు తరగతులకు హాజరు

హైదరాబాద్, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) : : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్మాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62 మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్

-మిగతా 2 లో

## జనసంద్రమైన మేడారం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- క్యూలైన్లలో గంటలతరబడి నిరీక్షణ

ములుగు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) : మేడారం మహా జాతరలో సమ్మక్క, సారలమ్మలు గద్దెలనెక్కారు. ఈ నేపథ్యంలో ఆ వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో భక్తులను కంట్రోలు చేయడం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించింది. ఇప్పటికే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ జాతరకు హాజరై.. వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.




-మిగతా 2 లో

## ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

- అతని భార్య అందంగా ఉంది..
- అందుకే అతనికి మంత్రి పదవి ఇచ్చా..

న్యూఢిల్లీ
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. యూఎస్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా డగ్ బర్గమ్‌ను ట్రంప్ నియమించారు. అయితే బర్గమ్ భార్య చాలా అందంగా ఉంటుందని.. అందుకే ఆయనకు పదవి ఇచ్చానని ట్రంప్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో బర్గమ్ భార్య కేథరిన్ అక్కడే ఉండటం గమనార్హం. బర్గమ్ నియామకంపై ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీశాయి.మాదక ద్రవ్యాల కట్టడి లక్ష్యంగా ఓ కార్యనిర్వహక ఉత్తర్వులపై గురువారం (స్థానిక కాలమాన ప్రకారం)



-మిగతా 2 లో


# ముగిసిన మున్సిపల్ నామినేషన్లు

## నేడు అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన

- తెలంగాణలో ముగిసిన మున్సిపల్ నామినేషన్ల ఘట్టం
- సాయంత్రం క్యూలో ఉన్న వారికి అనుమతి
- నామినేషన్‌ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు
- ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్
- ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు
- గజ్వేల్‌లో భారీ ర్యాలీ నిర్వహించిన ఎంపి రఘునందన్

హైదరాబాద్,- జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆఖరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్‌ల దాఖలుకు గడువు మగియగా.. అప్పటికే క్యూలైన్‌లలో ఉన్నవారు నామినేషన్‌లు వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్‌ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు విధించారు. కాగా ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 13న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

-మిగతా 2 లో




## నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే..

- స్కూళ్లలో ఉచిత శానిటరీ ప్యాడ్స్..
- విద్యార్థినిల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- ఇది రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుగా చూడాలి
- కేంద్రానికి సుప్రీం సూచన




2 లో

## ప్రశంసలు కాదు.. పనిపై శ్రద్ధ పెట్టండి

- ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాల్సిందే ఉత్తరాంధ్ర పంచాయితీ
- అధికారులతో డిప్యూటీ సిఎం పవన్

2 లో





## మేడారం మహా జాతరకు ప్రముఖుల రాక

- గవర్నర్, డిజిపి, మంత్రుల ప్రత్యేక పూజలు
- వెదురు కర్రలే దైవాలుగా... గ్గదెలే గర్భగుడులుగా
- కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న జాతర
- జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి

మేడారం,- జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) : వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు,కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్కరైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత మన దేవత జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా,

-మిగతా 2 లో

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

మొదటి తరువాయి

భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

మొదటి తరువాయి

అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్ర్యం÷-ర సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# రేవంత్‌కు.. హార్వర్డ్ సర్టిఫికెట్

మొదటి తరువాయి

వర్క్‌లతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

# జనసంద్రమైన మేడారం


మొదటి తరువాయి

ఈనె 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ఇంకో వైపు జాతరలో జరుగుతున్న పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. అదే సమయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కారు అద్దాలతో పాటు స్థానిక షాపులను భక్తులు ధ్వంసం చేశారు. అలాగే భక్తుల రద్దీని నియంత్రించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని.. వారంతా వీవీఐపీలు, పోలీస్ కుటుంబాల సేవల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.్ఱ÷ళిడారం ఉత్సవాల్లో భాగంగా బుధవారం.. సారలమ్మ, గురువారం.. సమ్మక్కలు గద్దెపైకి చేరుకున్నారు. దీంతో మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమై నట్లయింది. గురువారం అర్ధరాత్రి నుంచి వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ మేడారం విచ్చేసి.. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు వీఐపీలు, వీవీఐపీలు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో 25 మంది ఐపీఎస్‌లు అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది మేడారం తరలివస్తున్నారు.

# ప్రశంసలు కాదు..పనిపై శ్రద్ధ పెట్టండి

**ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాల్సిందే**

**ఉత్తరాంధ్ర పంచాయితీ అధికారులతో డిప్యూటి సిఎం పవన్**



**అమరావతి,**

తనకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదని, క్షేత్రస్థాయిలో నిజమైన పని మాత్రమే కావాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు పూర్తి నిబద్ధతతో పని చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.. ఉత్తరాంధ్ర పంచాయతీరాజ్ అధికారుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఘాటు వ్యాఖ్యలు చేశారు. అధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ వంటి కీలక పథకాల అమలులో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయినా, పనిలో అలసత్వం చూపించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సోషల్ ఆడిట్ పక్రియను కూడా మొక్కుబడిగా కాకుండా పక్కాగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేరాల్సిందేనని, అలా జరగకపోతే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.. ఇక, తన వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు, సిఫార్సులు ఉండవని పవన్ కల్యాణ్ స్పష్టంగా చెప్పారు. ప్రతి అధికారి నిబంధనల ప్రకారమే పని చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన కొంతమంది అధికారులు ఇప్పటికీ పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ ప్రభుత్వ విధానాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వ్యవహారాలను ఇకపై సహించబోమని హెచ్చరించారు.

# కేసీఆర్‌కు సిట్ షాక్

మొదటి తరువాయి



శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా..ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

# ముగిసిన మున్సిపల్ నామినేషన్లు

మొదటి తరువాయి




మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు రాష్ట్ర ఎన్నికల సంఘం 'టీఈ పోల్' మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పించినట్లు ఎస్ఈసీ తెలిపింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు మగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఫిబ్రవరి 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.అదే రోజు ్ఱ÷నైల్ అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తుంది ఈసీ. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 8203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 3 వరకు విత్ డ్రాలు నిర్వహించి అదే రోజు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల ముందే ప్రచారం ముగుస్తుంది. అంటే వచ్చే ఫిబ్రవరి 9వ తేదీన ప్రచారం బంద్ అవుతుంది. ఈ లెక్కన అభ్యర్థులు కేవలం ఆరు రోజులు మాత్రమే ప్రచారం చేయాల్సి ఉంటుంది.చివరిరోజు గజ్వేల్‌లో బిజెపి అభ్యర్థి నామినేషన్‌లో మెదక్ ఎంపి రఘునందన్ రావు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

# మేడారం మహా జాతరకు ప్రముఖుల రాక

మొదటి తరువాయి



ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క?సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.

# నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే..

**స్కూళ్లలో ఉచిత శానిటరీ ప్యాడ్స్..**

**కేంద్రానికి సుప్రీం సూచన**



**న్యూఢిల్లీ**

మహిళల ఆరోగ్యానికి సంబంధించి నెలసరి పరిశుభ్రత (మెనుస్ట్రువల్ హైజీన్)పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కు కిందకే వస్తుందని, స్కూళ్లలో విద్యార్థినిల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. స్కూళ్లలో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందించాలని, ప్రత్యేక టాయిలెట్లు ఉండాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఆధ్వర్యంలోని సుప్రీం బెంచ్ విచారించి తాజా సూచనలు చేసింది.ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే. పాఠశాలల్లోని విద్యార్థినులకు స్కూళ్లలో పర్యావరణ హితమైన శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందించాలి. విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ అందించడాన్ని దాతృత్వంలాగా చూడకూడదు. అలాగే విధానపరమైన నిర్ణయం తీసుకోవడం ద్వారానో అమలు చేయకూడదు. ఇది రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుగా చూడాలి. విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా టాయిలెట్లు ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు ఈ ఆదేశాలు పాటించాలి. ఒకవేళ ఇలా వేర్వేరు టాయిలెట్లు లేకపోతే గుర్తింపు రద్దు చేయొచ్చు. విద్యార్థినుల హక్కులను పాటించకపోతే అది ఆర్టికల్ 14 ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. బాలికలకు శానిటరీ ప్యాడ్స్ అందించడంలో విఫలమైతే ప్రభుత్వానిదే బాధ్యత. స్కూళ్లలో సరైన సౌకర్యాలు లేకపోతే బాలికల ఆరోగ్యం దెబ్బతింటుంది. స్కూళ్లలో శానటిరీ ప్యాడ్స్ అడగడానికి విద్యార్థినులు సంకోచించకూడదు. అలాగే.. టీచర్లు వారికి ఇవ్వాలని ఉన్నా వనరుల సమస్య ఉండకూడదు. సరైన, నాణ్యమైన, ప్రభావవంతమైన నెలసరి పారిశుధ్యాన్ని పాటిస్తే అది ఆడపిల్లల ఆరోగ్యానికి, మంచి చదువుకు కూడా దోహద పడుతుంది" అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

# ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

మొదటి తరువాయి

ట్రంప్ సంతకాలు చేశారు. ఓవల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దానికి సంబంధించిన వివరాలను ట్రంప్ వెల్లడించారు. ఈ సందర్భంగా బర్గమ్‌ను అంతర్గ వ్యవహారాల శాఖ మంత్రిగా నియమించడం వెనుక గల కారణాన్ని వివరించారు. ఎన్నికల ప్రచార వీడియోలో బర్గమ్ దంపతులు గుర్రపు స్వారీ చేస్తున్న దృశ్యాన్ని చూశానని ట్రంప్ తెలిపారు. అందులో ముందుగా బర్గమ్ భార్య కేథరిన్ తన కంటపడిందని చెప్పారు. అందులో ఆమె చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపించారని అన్నారు. 'ఆ వీడియో చూసి వెంటనే ఎవరు అని అడిగాను.. అది ఆయన గురించి కాదు.. ఆమె గురించే ' అని వ్యాఖ్యానించారు. అనంతరం తన సహాయకులు దంపతుల వివరాలు చెప్పారని అన్నారు. అప్పుడే బర్గమ్‌ను తన కేబినెట్‌లోకి తీసుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. "మీలా ఒక వ్యక్తికి జీవిత భాగస్వామిగా ఉండటం చాలా గొప్ప విషయం." అని నియామకం సందర్భంగా బర్గమ్‌ను ట్రంప్ ప్రశంసించారు. అయితే బర్గమ్ వ్యాపారవేత్తగా, నార్త్ డకోటా రాష్ట్రానికి రెండుసార్లు గవర్నర్‌గా సేవలందించారు. వీటిపై బర్గమ్‌ను ట్రంప్ ప్రశంసించినప్పటికీ, ఆయన విజయాల్లో భార్య పాత్రే ఎక్కువ ఉందని పదే పదే ప్రస్తావించడం ఇప్పుడు విమర్శలకు దారి తీసింది.

# బండ్లగూడ, బందం కొమ్ము పాఠశాలల్లో డిజిటల్ విద్య ప్రారంభం



**రామచంద్రాపురం, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రామచంద్రాపురం మండలంలోని బండ్లగూడ, బందం కొమ్ము ప్రభుత్వ పాఠశాలల్లో జగతి ఫౌండేషన్ -- సీ1 ఇండియా సహకారంతో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభమైంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం రూపొందించిన "3సీ-- కేర్ ~ కన్జర్వ్ ~ కంప్యూట్" హోలిస్టిక్ స్టూడెంట్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాములు మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో డిజిటల్ విద్య అత్యవసరమని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చదువుతో పాటు వాతావరణ అవగాహన, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. సి1 ఇండియా ఎండి చంద్ర బొడ్డోజు నాయకత్వంలో లీడర్షిప్ టీమ్ సభ్యులు రాజేష్ తాటినేని, రామస్వామి చంద్రశేఖరన్, హరికృష్ణ తోట, గోపి శ్రీనివాస్ తేడ్లాపు, అర్పితా మెహతా, ధరణ్ కుమార్ దారం సక్రియంగా పాల్గొన్నారు. టాలెంట్ డెవలప్మెంట్ పార్ట్నర్ గుడిమెట్ల రిషిత రెడ్డి కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపించారు. జగతి ఫౌండేషన్ బోర్డు సభ్యులు దుర్గా కళ్యాణి, అబూ బేకర్, రతన్ రాజా, కిరణ్ కుమార్, రామచంద్ర మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు భాష్యం పూర్ణిమ, నసీమా బేగం, సీఆర్పీలు సురేష్, వెంకన్నతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాత్ముడి ఆశయాలను కొనసాగించాలి



**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ప్రెస్) :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కల్వకుర్తి ఎమెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆమనగల్లు లోని గాంధీ విగ్రహానికి మండల నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి గాంధీజీ మార్గదర్శి అని, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాంరెడ్డి, యాట నరసింహ, శ్రీనివాస్ గౌడ్, గుర్రం కేశవులు,కృష్ణ నాయక్ మెకానిక్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ



**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, ఏసిపి జానకి రెడ్డి పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లు భద్రతా చర్యలను సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ జానకీ రాంరెడ్డి, ఎస్సై వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మకల్ 6వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థుల నామినేషన్





**కరీంనగర్ రూరల్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** 6వ డివిజన్ బొమ్మకల్‌లో భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేస్తూ రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, మ్యకల వెంకటేశ్, పుట్టపాక శ్రీధర్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా సాయవేణి సదానందం, పెద్ది లక్ష్మణ్, మెర్గవేని శ్రీకాంత్, నేరెళ్ళ శశి, నూకల ప్రశాంత్, పాశం కుమార్, పెద్ది పరశు రాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన మాజీ మార్కెట్ వైస్ చైర్మన్



**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ తోటగిరి యాదవ్ జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తోట గిరి యాదవ్ చేరికతో ఆమనగల్లు ప్రాంతంలో బీజేపీ బలోపేతం కానుందని పార్టీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# భారీ ర్యాలీతో బిజెపీ 15వ వార్డు అభ్యర్థి నామినేషన్



**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వ వార్డు బిజెపి అభ్యర్థి కండె సీతారాములమ్మ భారీ ర్యాలీతో నామినేషన్ కేంద్రానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. ఈ ర్యాలీలో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ఉత్సాహం నింపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని అభ్యర్థి తెలిపారు. ప్రజల ఆశీస్సులతో విజయం సాధించడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ ముగిసింది. చివరి రోజు మొత్తం 60 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణను ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అభ్యర్థులు పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం నామినేషన్ల సంఖ్య 109 కి పెరిగింది.

# గాంధీ మార్గం ఆచరణీయం



**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పట్టణంలోశుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన మార్గం శాంతి, అహింస అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వీరబొమ్మ రామ్మోహన్, దుర్గయ్య,చంద్రశేఖర్ శ్రీధర్,వెంకటయ్య, శ్రీనివాస్ ,శ్రవణ్,కొండల్ రెడ్డి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అహింసా వాదమే ఆయుధం

**అమరవాది లక్ష్మీనారాయణ గుప్త**



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త


**హైదరాబాద్, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** హైదరాబాద్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ సత్యం, అహింసను ఆయుధాలుగా స్వీకరించి స్వాతంత్ర్య పోరాటంలో జాతిపితగా నిలిచారని, నేటి తరానికి ఆయన సిద్ధాంతాలు ఆచరణీయమని పేర్కొన్నారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధనకు అందరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మల్లికార్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేష్ గుప్తా, పొలిటికల్ చైర్మన్ చింతల రవి కుమార్ గుప్తా, మీడియా కమిటీ చైర్మన్ అగరి వెంకటేష్ గుప్త, కార్యదర్శి అర్థం లక్ష్మయ్య గుప్త, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గందే సురేష్ గుప్త, ఉప్పల చంద్రశేఖర్ గుప్త, జిల్లా కోశాధికారి బద్రినాథ్ గుప్తతో పాటు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

# విజయవంతంగా కొనసాగుతున్న యూత్ కాంగ్రెస్ క్రికెట్ టోర్నమెంట్



**మంచాల,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆరుట్లలో శ్రీ వేణుగోపాల స్వామి రథోత్సవం జాతర సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన రెండో రోజు లీగ్ మ్యాచ్‌లలో విజేతలుగా నిలిచిన జట్లకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మార సురేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరే సికిందర్ రెడ్డి, ఆరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగల పరమేష్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రావుల మహేష్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు దాసరమోని అశోక్, భాస్కర్ రైనా, చీమర్ల గణేష్, చెరుకు శేఖర్, గొరిగే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు రహిత సమాజమే లక్ష్యం




**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కుష్టు వ్యాధి నిర్మూలన లక్ష్యంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది కలిసి కుష్టు వ్యాధిని సమాజం నుంచి పారద్రోలుతామని ప్రతిజ్ఞ చేశారు. వ్యాధి లక్షణాలను తొలి దశలోనే గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. బాధితుల పట్ల వివక్ష చూపకూడదని అనుమానం ఉన్నవారు భయపడకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మైమునా బేగం,ఏసు మని సునీత, లక్ష్మి మధు హెచ్ఈఓ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్ 15వ వార్డులో మమత మల్లారెడ్డి నామినేషన్



**ఇస్నాపూర్, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎల్లకొండ మమత మల్లారెడ్డి నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మల్లారెడ్డి అందించిన విశేషమైన సేవలను గుర్తుచేసుకుంటూ, అత్యధిక మెజార్టీతో మమత మల్లారెడ్డి గెలవాలని విజ్ఞప్తి చేశారు. గెలిచిన తర్వాత వార్డులోని ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మమత మల్లారెడ్డి హామీ ఇచ్చారు. తనకు అవకాశం కల్పించిన బి ఆర్ ఎస్ అధిష్టానానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## కుష్టు వ్యాధి పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**మనోహరాబాద్, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, శరీరంపై స్పర్శ లేని మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి నయం చేయవచ్చని వివరించిన ఆమె, మహాత్మా గాంధీ కలలు కన్న విధంగా కుష్టు వ్యాధి రహిత భారతదేశం నిర్మాణంలో అందరూ కృషి చేయాలని విద్యార్థులను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సమత, స్వప్న, ఏఎన్ఎం వినోద, ఉపాధ్యాయులు మల్లేశం, శ్రీదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలు సామరస్యంగా జీవించాలి

-- తహసిల్దార్ యాకయ్య



**ఎలిగేడు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలం శివపల్లిలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా తహసిల్దార్ యాకయ్య మాట్లాడుతూ గ్రామాల్లో కుల, మత తారతమ్యాలు లేకుండా ప్రజలంతా సామరస్య వాతావరణంలో కలిసి మెలసి జీవించాలని సూచించారు. కుల వివక్షత పాటిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాణి, ఎంపీడీవో భాస్కర్ రావు, ఆర్ఎస్ఐ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ




**గంగాధర, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి క్యాలెండర్ ఆఫ్ ద ఇయర్ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్స్ మరియు పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పడకంటి శ్రీనివాస్, సెక్రటరీ తమ్మిశెట్టి శ్రీనివాస్, ట్రెజరర్ ఇరుకుల్లా నాగార్జున, సేవాదళ్ అధ్యక్షుడు రేగురి కరుణాకర్, గౌరవ అధ్యక్షుడు నలుమాచు హరికిషన్‌తో పాటు మండల ఆర్యవైశ్య సోదరులు పాల్గొని విజయవంతం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుంది

డాక్టర్ కే. లక్ష్మణ్



**నల్లగొండ, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వాతావరణంలో ప్రజల్లో మార్పు కోరుకునే భావన స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. గతంలో బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని, అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హామీలు అమలు కావడం లేదని, యువత, మహిళలు, రైతులు, బడుగు వర్గాలు మోసపోయిన భావనలో ఉన్నారని ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి 35 శాతం ఓట్లు ఇచ్చి 8 మంది ఎంపీలను గెలిపించడం ద్వారా స్పష్టమైన సంకేతం ఇచ్చారని గుర్తుచేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, పేదల సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే కేంద్ర సహకారంతో నేరుగా నిధులు కార్పొరేషన్లకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. స్మార్ట్ సిటీ, అమృత్, గృహ నిర్మాణం, డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి పథకాలకు వేగంగా నిధులు వస్తాయని, పట్టణాభివృద్ధికి బలమైన పాలన అందిస్తామని స్పష్టం చేశారు. నల్లగొండ కార్పొరేషన్ 48 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేశామని, మేయర్ పీఠం బీజేపీకే లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాదగాని శ్రీనివాస్ గౌడ్, పిల్లి రామరాజు, నాగం వర్షిత్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు పిలుపు




**అచ్చంపేట ,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా అచ్చంపేట పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. మున్సిపాలిటీ పరిధిలో సమ్మె నిర్వహణకు అనుమతి కోరుతూ శానిటరీ ఇన్స్పెక్టర్ గణేష్‌కు కార్మికుల డిమాండ్లతో కూడిన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కార్యదర్శి బి. రాములు, సిపిఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు, ప్రజలపై భారాలు మోపేలా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు చెల్లించాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అదనంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల జాగాలు కేటాయించి, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేసి, ఆదివారాలు మరియు పండుగ రోజుల్లో సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది నాగమ్మ, బాలమ్మ, వెంకటయ్య, తిరుపతయ్య, ప్రవీణ్, దామోదర్, శంకర్, నవీన్, బాలకృష్ణ, రాజు, మల్లమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షా ఫలితాల విడుదల

**కరీంనగర్ ,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, స్వయంప్రతిపత్తి, కరీంనగర్‌లో 2025--26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రథమ మరియు తృతీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ప్రకటించారు. ప్రథమ సెమిస్టర్‌లో ఉత్తీర్ణత శాతం 63.61%, తృతీయ సెమిస్టర్‌లో 67.67%గా నమోదైంది. అకడమిక్ షెడ్యూల్ ప్రకారం విడుదలైన ఈ ఫలితాలు విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావానికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయని కళాశాల అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ లేదా పరీక్షల విభాగం ద్వారా పరిశీలించవచ్చని




సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా అకడమిక్ ఉన్నతికి కృషి చేయాలని ప్రోత్సహించారు. మహిళలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో కళాశాల కట్టుబడి ఉందని, రీ వాల్యుయేషన్ లేదా రీ కౌంటింగ్ కోసం నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి జి. శ్రీనివాస్ రెడ్డి, అదనపు నియంత్రణాధికారులు కె. సతీష్ కుమార్, బి. రజని దేవి, అకడమిక్ కోఆర్డినేటర్లు ఎన్. మనోజ్ కుమార్, సి. విద్య, చీఫ్ కోడింగ్ ఆఫీసర్ డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

**ఎలిగేడు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ ఎస్సీ కాలనీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎలిగేడు ఏఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, లాలపల్లికి చెందిన నల్ల శ్రీనివాసరెడ్డి (35) బైక్‌పై గర్రెపల్లి వైపు వెళ్తుండగా, సుల్తానాపూర్ గ్రామానికి చెందిన పెద్ది పోచాలు (45) ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తుండగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శ్రీనివాసరెడ్డికి ముఖానికి, పోచాలకు నడుంకు, ముఖానికి గాయాలు కావడంతో వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గాయపడిన శ్రీనివాసరెడ్డి ఆర్మీలో ఉద్యోగం చేస్తూ, సెలవుపై లాలపల్లికి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.




# వనదేవతలను దర్శించుకున్న పలువురు ప్రముఖులు



**పాలకుర్తి,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలోని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలకు శుక్రవారం పలువురు ప్రముఖులు, అధికారులు మొక్కులు సమర్పించారు. గురువారం రాత్రి చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని కోయపూజారులు గద్దెపై ప్రతిష్టించగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా పోలీసులు, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది తోపులాటను అదుపు చేశారు. శుక్రవారం భక్తులు తండోపతండాలుగా వచ్చి ఎదురు కోళ్లతో మొక్కులు చెల్లించారు. ఇండియన్ బ్యాంకు సిబ్బంది క్యూ లైన్ల వద్ద భక్తులకు మినరల్ వాటర్ అందించారు. మొక్కులు చెల్లించిన వారిలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ దంపతులు, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ అధికారులు ప్లాంట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఆర్ పార్థసారథి దంపతులు, రామగుండం బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి ఉన్నారు. వచ్చిన ప్రముఖులకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానం చేసి, జాతర నిర్వహణకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మహాత్మా గాంధీ 78వ వర్ధంతి వేడుకలు












**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ పట్టణంలో వివిధ సంఘాలు, క్లబ్‌లు, రాజకీయ నాయకులు, సామాజిక సంస్థలు ఘనంగా నివాళులు అర్పించారు. వైశ్య భవన్‌లో చర్చాగోష్ఠి వైశ్య సేవకేంద్రంలో గాంధీజీ మహాత్ముడు ఎలా అయ్యాడు అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. సర్వోదయ వ్యవస్థాపకులు తోట లక్ష్మణరావు మాట్లాడుతూ గాంధీజీ నిరాహార దీక్షలు, ఉప్పు సత్యాగ్రహం, పాదయాత్రలు ప్రజలను ప్రభావితం చేశాయని, ఆయన త్యాగమే మహాత్మునిగా నిలిపిందని పేర్కొన్నారు. అధ్యక్షులు పెద్ది లక్ష్మీనారాయణ, గాందేయవాది ఉప్పల రామేశం తదితరులు ప్రసంగించారు.

**వాసవి వనిత ఏంజిల్స్ కార్యక్రమం**

వాసవి వనిత ఏంజిల్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను పుష్పాలు, బట్టలు, శాలువాలతో సత్కరించారు. అదే సమయంలో వెంకటేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా 108 రకాల పుష్పాలను దేవునికి సమర్పించారు.



**గీత భక్త సమాజం-వాసవి క్లబ్**

వాసవి క్లబ్ ఎం.ఆర్. కరీంనగర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి స్వచ్ఛభారత్ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు చిట్టుమల్ల సత్యనారాయణ మాట్లాడుతూ గాంధీజీ బోధించిన అహింసా మార్గం, ఆయన త్యాగాలు దేశానికి గర్వకారణమని అన్నారు. గీత భక్త సమాజం సభ్యులు గాంధీ విగ్రహం వద్ద భగవద్గీత శ్లోకాల పారాయణం చేసి, ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**కాంగ్రెస్ నాయకుల నివాళులు**

డిసిసి కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ పోరాటాలు దేశానికి మార్గదర్శకమని, వాటిని చెరిపివేయాలనే ప్రయత్నాలు ప్రజలు అంగీకరించరని అన్నారు. ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ గాంధీ స్వదేశీ ఉద్యమానికి పునాదులు వేసారని, ఆయన పేరును తొలగించే ప్రయత్నం ప్రజల అవమానమని పేర్కొన్నారు.

**వాగ్దేవి క్లబ్ కార్యక్రమం**

వాసవి వనిత వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం గిద్దె పెరుమాళ్ల ఆలయంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొత్తం కరీంనగర్ పట్టణం గాంధీజీ త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన అహింసా మార్గంలో నడవాలని సంకల్పం వ్యక్తం చేసింది.

# కాల్వకు గండి పడే ప్రమాదం పొంచి ఉంది...

### రాములపల్లిలో ఎస్సారెస్పీ - 10కెనాల్పై నీరు ప్రవహిస్తున్న దృశ్యం



**ఎలిగేడు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** :మండలంలోని రాములపల్లి గ్రామంలో గంగిరెడ్డుల కాలనీకి వెళ్లేదారిలో ఎస్సారెస్పీ 10ఎల్ కాల్వపై నీరు ప్రవహిస్తుండటంతో కాల్వకు గండి పడే ప్రమాదం ఉండటంతోపాటు నీరు వృధాగా పోతుందని రైతులు . గ్రామసర్పంచ్ సిద్ది తిరుపతియాదవ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగిరెడ్డుల కాలనీకి వెళ్లేదారిలో సిమెంట్పైపులు వేసిన కల్వర్టు గత పదేళ్ల నుండి పైపుల్లో చెత్త,చెదారం జమకావడం వల్ల కాల్వ నీరు కల్వర్టుపైకి వచ్చి రోడ్డుపై వృధాగా పోవడమేకాకుండా గండిపే అవకాశాలు ఉన్నాయని. నీటి ప్రవాహం వలన రాకపోకలకు ఇబ్బందలు తలెత్తుతున్నాయని. ఈ సమస్యను పర్కిరించాలని పైపుల బ్రిడ్జి తొలగించి ఓపెన్ కల్వర్టు నిర్మించాలని ఎస్సారెస్పీ అధికారులకు గత ఎమ్మేల్యేకు ఎన్నోసార్లు విన్నవించినప్పటికీ స్పందనలేదని, ఇప్పటికైనా ప్రస్తుత ఎమ్మేల్యే చింతకుంట విజయరమణారావు. ఎస్సారెస్పీ అధికారులు స్పందించి కాల్వకు గండి పడకుండా నీరు వృదా పోకుండా, రాకపోకలకు ఇబ్బందలు తలెత్తకుండా సమస్యను పర్కిరించాలనీ సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్ ప్రజలు రైతులు కోరుతున్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ 78వ వర్ధంతి వేడుకలు



**అచ్చంపేట ,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. యూనియన్ అధ్యక్షుడు మహబూబ్ అలీ మాట్లాడుతూ గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి స్వాతంత్ర్య సమరంలో చేసిన త్యాగాలు అపారమని, ఆయన మహనీయతను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మాను, అషు, జాంగిర్, చందు, కాజా శ్రీనివాస చారి, ముస్తాక్, అఖిల్, నిరంజన్, లక్ష్మయ్య, శంకర్, అశోక్, అక్బర్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ జెండాలు కట్టకూడదని తీర్మానం



**అచ్చంపేట, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని లింగాల రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు కట్టకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశంపై చర్చించి తీర్మానం చేసి ఆమోదించారు. తీర్మాన పత్రాన్ని కమిషనర్ మురళి చేతుల మీదుగా అంబేద్కర్ సంఘం నాయకులకు అందజేశారు. ఈ తీర్మానానికి విరుద్ధంగా ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలు కడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ మురళి, మేనేజర్ రమేష్ నాయక్, అంబేద్కర్ సంఘం నాయకులు, పాతుకుల శ్రీశైలం, ఆనందు తదితరులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్లో అభివృద్ధి పనులు వేగవంతం

**- ఎమ్మెల్యే వంశీకృష్ణ**



**అమ్రాబాద్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. పనులు శరవేగంగా, నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల దశాబ్దం పాటు అభివృద్ధి కుంటుపడిందని ఆయన వ్యాఖ్యానించారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, పెండింగ్‌లో ఉన్న సమస్యలను చర్చించారు. కూరగాయల మార్కెట్‌తో పాటు అన్ని రకాల వ్యాపారాలు సులభంగా కొనుగోలు చేసే విధంగా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ సర్పంచ్ చిగురుల కోటయ్య, ఉప సర్పంచ్ రాజారాం గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బాలలింగం గౌడ్, మాజీ ఎంపిటిసి తిరుమలయ్య, చెన్నకేశవులు, ముక్రమ్ ఖాన్, ముఖ్బుల్, రఘు చారి, జిల్లా కార్యదర్శి కోరే రేనయ్య, లింగం, ఇమ్మడి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ 14వ వార్డు కౌన్సిలర్ బరిలో వంతడుపుల మేఘన



**హుస్నాబాద్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగర పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో హుస్నాబాద్ 14వ వార్డు కౌన్సిలర్‌గా వంతడుపుల మేఘన బరిలో నిలిచారు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసిన విద్యావంతురాలు మేఘన రాజకీయాల్లోకి రావడం పట్ల వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యువతే రాజకీయాల్లో రాణించగలరని ప్రజల కోరిక మేరకు ఆమె నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక వ్యక్తిగా వార్డులోని సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న మేఘన, ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కుటుంబ సభ్యులతో కలిసి రేకుర్తి లోని సమ్మక్క సారక్కలను దర్శనం చేస్కొన్న కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

# అల్గునూర్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇంటింటా ప్రచారం



**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అల్గునూర్‌లో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పాత శివాలయం ప్రాంతంలో ఇంటింటా ప్రచారం చేస్తూ గ్రామ అభివృద్ధి కోసం గోపు మల్లారెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. అలుగునూరు ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి సాధించిందని, మల్లారెడ్డి గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తరువాత నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సమ్మక్క--సారలమ్మ జాతరల్లో పాల్గొని వనదేవతలకు మొక్కులు చెల్లించారు. కేశవపట్నం, కొండపల్లి, కొత్తపల్లి, గన్నేరువరం, బెజ్జంకి, వడ్లూరు, తోటపల్లి గ్రామాల్లో జాతరల్లో పాల్గొని ప్రజల సుఖసంతోషాలు, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి పాలాభిషేకం



**గంగాధర, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలో వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం చిత్రపటానికి రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా పాలాభిషేకం చేశారు.

# స్పర్శ్ లెప్రసీపై అవగాహన సదస్సు




**గంగాధర, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, అదనపు వైద్యాధికారి (ఎయిడ్స్ ఞ లెప్రసీ) డాక్టర్ సుధ ఆధ్వర్యంలో కరపత్రాల విడుదలతో ప్రారంభించారు. డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు ఈ అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని, వివక్షతను అంతం చేయడం -- గౌరవాన్ని కాపాడటం లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం కల్పించనున్నామని తెలిపారు. వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి బహుళ ఔషధ చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుందని అన్నారు. డాక్టర్ సుధ చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతూ, స్పర్శ లేని రాగి మచ్చలు ఉన్నవారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని, నిర్ధారణ అయినవారు ఎండీటి చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. తదనంతరం ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి కుష్టు వ్యాధిగ్రస్తులను కుటుంబ సభ్యులుగా భావించి వివక్ష లేకుండా చికిత్స అందించాలని, అంగవైకల్యం రాకుండా సమాజంలో అవగాహన వ్యాప్తి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలు ప్రతి గ్రామం, పాఠశాల, కళాశాలలో విద్యార్థుల భాగస్వామ్యంతో కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ సుధ, డాక్టర్ నిక్హత్, డెమో రాజగోపాల్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు ప్రకాశరావు, కృపలాదేవి, చొప్పదండి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీ కీర్తన, సూపర్వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ పరిశీలన కలెక్టర్ కె. హైమావతి



**హుస్నాబాద్, జనవరి 30( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: 2వ సాధారణ పురపాలక సంఘం ఎన్నికలు--2026 ప్రక్రియలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి జిల్లా మున్సిపాలిటీ ఎన్నికల సాధారణ పరిశీలకులు అయేషా మస్రత్ ఖానం తో కలిసి పరిశీలించారు. జిల్లాలో చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ మున్సిపాలిటీల్లో చివరి రోజు నామినేషన్ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ స్వీకరించనున్నట్లు, 5 గంటల తర్వాత ఎవరికీ అనుమతి ఇవ్వకూడదని, గేట్ మూసివేయాలని అధికారులకు ఆదేశించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం సెంటర్ చుట్టూ 100 మీటర్లలో 144 సెక్షన్ అమలు చేయాలని, అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించాలని పోలీసులకు సూచించారు. నామినేషన్ ప్రక్రియను వీడియో తీయాలని, సెంటర్‌లో ఫోన్ అనుమతి లేదని, అన్ని సెంటర్లలో వెబ్‌కాస్టింగ్ జరుగుతోందని తెలిపారు. అభ్యర్థి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే స్వీకరించి రిసీవ్డ్ స్లిప్ ఇవ్వాలని ఆర్‌ఓలకు ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మైనారిటీ నేతల ఆగ్రహం




**కరీంనగర్ ,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఒక వీధి రౌడీలా మాట్లాడటం సిగ్గుచేటు అని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ తీవ్రంగా విమర్శించారు. వీణవంకలో జరిగిన సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా పోలీసులు కుటుంబ సభ్యులు మాత్రమే వెళ్లాలని, మిగత వారు వెనక్కి వెళ్లాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కౌశిక్ రెడ్డి జాతర స్థలం మాదని కేసు వేసి, కోర్టు తీర్పును పట్టించుకోకుండా గొడవకు దిగారని ఆయన ఆరోపించారు. జాతర వంశీకులైన పాడి సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులే నిర్వహణ హక్కు కలిగినవారని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. తాజోద్దీన్ మాట్లాడుతూ, డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులపై దురుసుగా ప్రవర్తించి, జిల్లా పోలీసు అధికారి గౌస్ ఆలం పై కులం పేరుతో మాట్లాడటం ముస్లీం సమాజాన్ని కించపరిచే చర్య అని, దీనిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గతంలోనూ కౌశిక్ రెడ్డి నేరచరిత్రతో ప్రజలను మోసం చేశారని, హుజురాబాద్ ప్రజలను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే ముస్లీంలను కులం పేరుతో కించపరిచే వ్యాఖ్యలు చేస్తే కేసు నమోదు చేయాలని చట్టం తీసుకువచ్చారని, ఆ చట్టం ప్రకారం కౌశిక్ రెడ్డి పై మొదటి కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. తెరాస పార్టీ సెక్యులర్ పార్టీ అని చెప్పుకుంటూ బీజేపీ కంటే హీనంగా మాట్లాడిన కౌశిక్ రెడ్డి పై కేసీఆర్, కేటీఆర్ చర్యలు తీసుకుని పార్టీ నుండి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్, లయీక్ ఖాద్రీ, అబ్దుల్ రహ్మాన్, మొహమ్మద్ కలిమొద్దీన్, ఆరిఫ్ ఖాన్, సయ్యద్ కరీం పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్వాదార్ హోమ్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె. రాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శిగా స్వాదార్ హోమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో ఎటువంటి లైంగిక వేధింపులకు గురైన వారు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా మిత్రులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. చెడు అలవాట్లకు లోనై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, చిన్నతనం నుంచే చదువుపై ఆసక్తి కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ఆహార పదార్థాలను నిల్వ చేసే గదులను తనిఖీ చేసి పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. న్యాయపరమైన లేదా న్యాయ సేవ అవసరమైతే వెంటనే సంప్రదించాలని ఆదేశించారు. అనంతరం స్వాదార్ హోమ్‌లో పండ్ల పంపిణీ చేశారు.



# సువర్ణాక్షరాలతో దేవస్థాన వ్యవస్థాపకుల పేర్లు

**పాలకుర్తి,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో శ్రీ సమ్మక్క--సారలమ్మ దేవస్థానం నిర్మాణానికి నలభై ఏళ్ల క్రితం గ్రామ పెద్దలు ముందడుగు వేశారు. వాస్తు ప్రకారం ఆలయాన్ని నిర్మించి జాతర నిర్వహణకు పునాది వేసిన వారిలో గాలిపెల్లి మల్లయ్య, గాలిపెల్లి నర్సయ్య, పూసాల లక్ష్మయ్య, సంతపూరి నారాయణ, సంకెండ్ల శంకరయ్యలు ఉన్నారు. ప్రస్తుతం వీరిలో నలుగురు పరమపదించారు, గాలిపెల్లి నర్సయ్య మాత్రం కమిటీ చైర్మన్‌గా కొనసాగుతూ జాతర నిర్వహణను ముందుకు తీసుకెళు తున్నారు.జాతర అప్పటి నుండి ఇప్పటి వరకు గ్రామ



ప్రజల సహకారంతో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ దేవస్థానాన్ని నిర్మించిన వారిని భవిష్యత్తులో ఎవరు మర్చిపోకూడదని భావించిన రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతి, గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు కలిసి గుడి ప్రధాన ద్వారం ముందు ఒక బోర్డుపై వారి పేర్లను సువర్ణాక్షరాలతో రాసి ఏర్పాటు చేశారు. వ్యవస్థాపకుల కుటుంబ సభ్యులు ఈ బోర్డును చూసి ఆలయ నిర్మాణానికి వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు గుర్తుకు తెచ్చుకుని ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ స్థాయిలో రాణించిన ముల్కనూరు మోడల్ స్కూల్ పిడి రమ్యా యాదవ్



**హుస్నాబాద్ నియోజకవర్గం, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండలం టీజీఎంఎస్ ముల్కనూరుకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ రమ్యా యాదవ్ జాతీయ స్థాయిలో మరో విశిష్ట ఘనత సాధించారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రానికి చెందిన ఆమె, హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 27 నుంచి 30 వరకు జరిగిన 72వ సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు రిఫరీగా ఎంపికయ్యారు.కబడ్డీ రంగంలో ఆటగాళ్లకు శిక్షణ ఇవ్వడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రిఫరీగా తన ప్రతిభను చాటుకుంటూ వస్తున్న రమ్యా యాదవ్ ఎంపిక క్రీడా పరిజ్ఞానం, అనుభవం, నిబద్ధతకు నిదర్శనమని క్రీడా వర్గాలు అభినందిస్తున్నాయి.ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హర్షిత్ కౌర్ మాట్లాడుతూ రమ్యా యాదవ్ జాతీయ స్థాయిలో రిఫరీగా ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని, ఆమె కృషి, క్రమశిక్షణ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలను అధిరోహించాలని ఆకాంక్షించారు.టీజీఎంఎస్ ముల్కనూరు యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు రమ్యా యాదవ్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తూ ఈ విజయం పాఠశాల క్రీడా రంగానికి మరింత గుర్తింపును తెచ్చిందని పేర్కొన్నారు.

# మానసిక వేదనతో వృద్ధుడు మృతి

**గంగాధర, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం పోతుగంటిపల్లి గ్రామానికి చెందిన కదారి మల్ల రెడ్డి (85) ఇంట్లో ఉరి వేసుకుని



మృతి చెందాడు.గత రెండు సంవత్సరాల క్రితం భార్య అనారోగ్యంతో మరణించడంతో ఒంటరితనంలో మల్ల రెడ్డి మానసిక వేదనకు గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈరోజు ఉదయం తన గదిలో ధోతితో ఉరి వేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు.ఈ ఘటనపై కుమారుడు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గంగాధర ఎస్సై బీ. వంశీకృష్ణ తెలిపారు.

### ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ స్థల పరిశీలన -- సీపీ సుధీర్ బాబు





**కందుకూరు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మిర్ ఖాన్ పేట సర్వే నం.112లో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కార్యాలయం కోసం కేటాయించిన 30 ఎకరాల భూమిని సీపీ సుధీర్ బాబు పరిశీలించారు. రోడ్లకు కావలసిన విస్తీర్ణాన్ని కూడా ఆయన పరిశీలించి, త్వరలోనే భూమి పూజ నిర్వహించి కమిషనరేట్ కార్యాలయ భవనం నిర్మాణానికి సన్నాహాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం ఎసిపి కేపీవి రాజు, గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ సిఐ సత్యనారాయణతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# యాప్ ద్వారా ప్రారంభమైన యూరియా అమ్మకాలు

**- కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో జనవరి 31 నుంచి యూరియా అమ్మకాలు పూర్తిగా యూరియా బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే జరగనున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. రైతులు తమ పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా కావలసిన యూరియాను ముందుగానే యాప్ ద్వారా బుక్ చేసుకుని, ఎరువుల డీలర్ వద్ద కొనుగోలు చేయాలని సూచించారు. కౌలు రైతులు యజమాని నుండి ఓటీపీ పొంది యూరియా బుక్ చేసుకోవాలి. రైతుల పట్టా పాస్‌బుక్ తప్పనిసరిగా వారి మొబైల్ నంబర్‌కు అనుసంధానం చేయాలి. ఎవరి స్మార్ట్‌ఫోన్ ద్వారానైనా ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఒకసారి బుక్ చేసిన యూరియాను తర్వాత రోజు అర్ధరాత్రి వరకు మాత్రమే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఒకసారి కొనుగోలు చేసిన తర్వాత రెండో విడత బుకింగ్ 15 రోజుల తరువాత మాత్రమే చేయవచ్చు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద రైతులకు సహాయం చేయడానికి వాలంటీర్లు అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**- ఆమనగలు ఎస్సై వెంకటేష్**




**ఆమనగల్లు, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ప్రస్తుత రోజుల్లో సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు ఎస్ఐ వెంకటేష్ సూచించారు. ట్రాఫిక్ చలాన్లు,లింకులు, ఓటీపీలు అనుమానాస్పద కాల్స్ కి స్పందించవద్దని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత బ్యాంకు వివరాలు ఎవరికి చెప్పకూడదని పేర్కొన్నారు. మోసాలకు గురైతే వెంటనే 1930 కు ఫోన్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.


# దక్షిణ భారత అంతర్విశ్వవిద్యాలయ సాఫ్ట్‌బాల్ పోటీలకు శాతవాహన జట్టు



**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దక్షిణ భారత అంతర్విశ్వవిద్యాలయ సాఫ్ట్‌బాల్ పోటీలకు శాతవాహన విశ్వవిద్యాలయ జట్టును ఎంపిక చేశారు. మహారాష్ట్రలోని అమరావతిలో సంత్ గాడ్గే బాబా విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 1 నుండి 5 వరకు జరిగే ఈ పోటీలకు దినేష్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.జట్టులో వినోద్, పీరియా, నరేష్, కళ్యాణ్, వేణు మాధవ్ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజ్, అంజన్ సాయి నిగమ వ్యాయామ విద్య కళాశాల, రిత్విక్ సూర్య వివేకానంద డిగ్రీ కళాశాల, వివేక్ ఎస్ఆర్ఆర్ కళాశాల, కార్తీక్ ఎస్‌కేఎన్ఆర్ కళాశాల, జగిత్యాల, వంశీ, అరుణ్ కామర్స్ కళాశాల, శాతవాహన విశ్వవిద్యాలయంతో మొత్తం 11 మంది క్రీడాకారులు ఉన్నారు.ఈ సందర్భంగా శాతవాహన ఓఎస్‌డీ టు వీసీ డాక్టర్ హరికాంత్ క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలని సూచించారు. స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ మునవర్ ట్రాక్ షూట్లను అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. కృష్ణ కుమార్, డా. మనోహర్, డా. శ్రీరంగప్రసాద్ పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీన గ్రామాలకు ఎన్నికల కోడ్

**కరీంనగర్ రూరల్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని అధికారులు ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం లేదా స్వీకరించడం,



ఓటర్లను ప్రభావితం చేయడానికి ఏవైనా ప్రేరేపణలు చేయడం ఎన్నికల చట్టాల ప్రకారం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. నోటిఫైడ్ నిషేధ కాలంలో మద్యం అమ్మకం, రవాణా, వినియోగం పూర్తిగా నిషేధించబడింది.ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, బెల్టుషాపులు నడిపిన, మాదక ద్రవ్యాలు వినియోగించిన లేదా అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.ఓటు విలువైన ప్రజాస్వామ్య హక్కు అని గుర్తుచేస్తూ, ఓటర్లు భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి అన్నారు.

# బీఆర్ఎస్‌కు మరో షాక్ బీజేపీలో చేరిన నేతలు



**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీఆర్ఎస్ పార్టీకి మరో పెద్ద దెబ్బ తగిలింది. 35వ వార్డు కార్పొరేటర్ సాధవేని శ్రీనివాస్, కరీంనగర్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండి ప్రశాంత్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకొని అధికారికంగా చేరికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కోమాల అంజనేయులు వారిని ఆహ్వానించారు. మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ఓదెలు తదితరులు హాజరయ్యారు.బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్రం నుండి దాదాపు 1500 కోట్ల రూపాయలకు పైగా నిధులు తెచ్చానని, కార్పొరేషన్‌లో జరుగుతున్న ప్రతి పని కేంద్ర నిధులతోనే సాధ్యమైందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చుతూ, ఎన్నికల ప్రచారంలో పూర్తి వివరాలతో ప్రజల ముందుకు వెళతానని స్పష్టం చేశారు.

## ఎస్సీ వర్గాల సంక్షేమంపై
# ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఎస్సీ వర్గాల సంక్షేమంపై అధికారులు మరింత దృష్టి సారించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి గూడె శ్రీనివాస్ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గాల సంక్షేమానికి అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఎస్సీలపై వివక్ష, అణచివేత ఘటనలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలని, ఎస్సీ--ఎస్టీ అట్రాసిటీ



కేసుల్లో వేగవంతమైన విచారణ జరిపి బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆయన ఆదేశించారు. గ్రామ స్థాయి వరకు సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు. ఎస్సీ వర్గాల విద్యా ప్రగతి, ఆర్థిక సాధికారత, జీవన ప్రమాణాల మెరుగుదలే ప్రభుత్వ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ల వసతులు, స్వయం ఉపాధి యూనిట్లు, ఆర్థిక సహాయం, భూ సమస్యలపై వివరాలు సేకరించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఎస్సీ--ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అట్రాసిటీ కేసులపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ విచారణ వేగవంతం అయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, ఆర్డీవో కె. మహేశ్వర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎస్సీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు నాగైలేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అనిల్ ప్రకాష్, ఏసీపీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ

**- కలెక్టర్ కె. హైమావతి**

**హుస్నాబాద్ ,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మెనూ పాటించకుండా నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారంటూ విద్యార్థులు గురువారం ధర్నా చేసిన ఘటనపై స్పందించిన కలెక్టర్, సమస్యకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ధర్నాపై విద్యార్థుల ద్వారా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను



ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వసతి గృహాన్ని తరచుగా తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కూరలు నాణ్యతతో ఉండాలని, కామన్ డైట్ మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనం తయారు చేయాలని ఆదేశించారు. వసతి గృహం లోపల, బయట పరిశుభ్రత పాటించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారి జి. మల్లేశంకు సూచించారు. విద్యార్థులకు భోజనం, వసతి విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## జాతీయ ఉపాధి హామీ
# పథకంపై బీజేపీ కపట ప్రేమ

**-- ఎమ్మెల్యే వంశీకృష్ణ**

**ఉప్పునుంతల, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉప్పునుంతల మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి నిర్వహించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, గ్రామీణ పేదలకు ఉపాధి హామీ కల్పించేందుకు 2005లో యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి 2006లో పనులు ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా పేదరికం, నిరుద్యోగం, వలసలు, శ్రామిక వర్గాల దోపిడి, స్త్రీ--పురుష వేతన అసమానతలు తగ్గాయని, ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి కల్పించి కనీస వేతనం అందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత 20 ఏళ్లలో రాష్ట్రంలో లబ్ధి పొందిన వారిలో 90 శాతం



ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు కాగా, 62 శాతం మహిళలు ఉపాధి పొందారని వివరించారు. ప్రస్తుతం కనీస వేతనం 400 రూపాయలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాజాగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజుగారు మరియు అజీవిక మిషన్ గ్రామీణ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీకి అరకొర నిధులు కేటాయించి, పథకాన్ని నిర్వీర్యం చేయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం బాధాకరమని, ఈ చట్టం కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని అన్నారు. రైతు వ్యతిరేక చట్టాల మాదిరిగానే ప్రజలు ఏకమై పోరాటం చేసి ఈ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగించాలని కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ నాగర్‌కర్నూల్ జిల్లా కోఆర్డినేటర్ చత్రు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ నరసింహారెడ్డి, కాశన్న యాదవ్, కుంద మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ చింతగాల శ్రీనివాసులు, యువజన కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, బీసీ సంఘాల నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కూలీలు పాల్గొన్నారు.

# మున్సిపల్ బరిలోకి జనసేన పార్టీ

**జనసేన పార్టీ ఇంచార్జ్ కొర్ర చందు నాయక్.**

**దేవరకొండ జనవరి 30. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణం 16 వార్డు నామినేషన్ జనసేన పార్టీ ఇంచార్జ్ కొర్ర చందు నాయక్ వేశారు. అనంతరం జనసేన పార్టీ ఇంచార్జ్ కోర్ర చందు నాయక్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎలక్షన్లో జనసేన పార్టీ రంగంలో దిగనుంది జనసేన పార్టీ ఏర్పడ్డప్పటినుంచి పార్టీలో ఉంటూ దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు నా వంతు కృషి చేస్తూ



అన్ని వేళలో విద్య వైద్యం విషయంలో అధికారులకు అధికార పార్టీతో కొట్లాడి ప్రజలకు న్యాయం చేసే విధంగా జనసేన పార్టీ ముందుంటుందని అలాగే రాబోయే రోజుల్లో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఊహించుకొని స్థానాలు జనసేన పార్టీ ఉంటుందని ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి అయినట్టు తెలంగాణ రాష్ట్రంలో కూడా జనసేన పార్టీ వస్తే అభివృద్ధి బాగుంటుందని ప్రజలు అంటున్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో బెజవాడ శేఖర్, హనుమంతు, గోపి వినోద్, శివ రమేష్, శంకర్ తదితరులు నామినేషన్ లో పాల్గొన్నారు.

# గల్లీ గల్లీ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**కరీంనగర్, జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ, కరీంనగర్లో అభివృద్ధి పనులు గల్లీ గల్లీకి తీసుకెళ్లేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని దీవించాలని కోరుతూ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం 66వ డివిజన్ టవర్ ప్రాంతంలో మాచర్ల ప్రసాద్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, బీజేపీ--టీఆర్ఎస్ మాటలు నమ్మవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, డివిజన్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దేవరకొండ ఎక్సైజ్ శాఖ కార్యాలయం ప్రభుత్వ కార్యాలయంలోకి తరలింపు



**దేవరకొండ జనవరి 30. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలో ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం గతంలో అద్య భవనంలో ఉంటున్నది ప్రస్తుతం దీనిని ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో ఉన్న పాత గృహ నిర్మాణ శాఖ భవనంలోకి శుక్రవారం మార్చినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం జనవరిలోపు ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సూచించడంతో అద్దె భవనం నుంచి ప్రభుత్వ భవనాల్లోకి మార్చినట్లు తెలిపారు. ఇప్పటినుండి ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తామని ఎక్సైజ్ శాఖ సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖబృందం పాల్గొన్నారు.


## 27వ వార్డులో మురళీమోహన్ నామినేషన్



**షాద్ నగర్, జనవరి 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ కౌన్సిలర్ మురళీమోహన్ (అప్పి) 27వ వార్డులో నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ఆశీస్సులతో ఈ నామినేషన్ వేయడం జరిగింది. వెంకటేశ్వర, తిరుమల కాలనీలతో పాటు అనేక ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున ఊరేగింపుగా మున్సిపాలిటీ కార్యాలయానికి తరలి వచ్చారు. పట్టణం అంతా జయజయధ్వానాలతో మారుమోగింది. నామినేషన్ అనంతరం మురళీమోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీలో ప్రతి వార్డులోనూ సిసి రోడ్లు, కాలువల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించిందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలే పార్టీకి విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజద్ గోరి, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి, చంద్రశేఖర్ కుమ్మరి, శుక్రవారం రెడ్డి, పోలేపల్లి అంజయ్య, జగన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ గౌడ్, సాయి గౌడ్, అనిల్, జమీల్, పాండురంగయ్య, రఘు, పోలేపల్లి సందీప్ గౌడ్, కుమ్మరి శ్రీశైలం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 16 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా బ్యాన్ చేయండి..


## - ప్రధాని మోదీకి సోనూ సూద్ విజ్ఞప్తి!



**న్యూఢిల్లీ, జనవరి 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పిల్లల భవిష్యత్తు మరియు పెరుగుతున్న డిజిటల్ వ్యసనంపై బాలీవుడ్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. 16 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధం విధించాల్సిన అవసరం ఉందంటూ ఆయన చేసిన సోషల్ మీడియా పోస్ట్ అందరినీ ఆలోచింపజేస్తోంది. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో పిల్లలు భోజనం చేస్తూ కూడా ఫోన్లు స్క్రోలింగ్ చేస్తున్నారని, ఆ విషయాన్ని తల్లిదండ్రులు సైతం పట్టించుకోకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఇది మన భవిష్యత్తు కాకూడదని హెచ్చరించారు. ఈ క్రమంలోనే 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాను దూరం చేయడం తక్షణ అవసరమని సోనూ సూద్ పేర్కొన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేసిందని, త్వరలో గోవా ప్రభుత్వం కూడా దీనిని అనుసరించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిని ఒక జాతీయ ఉద్యమంగా మార్చాలని గౌరవప్రధాని నరేంద్ర మోదీని కోరుతూ, పిల్లల మానసిక ఆరోగ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సోనూ సూద్ స్పష్టం చేశారు. కాగా ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# అమెరికాపై దాడికి 1,000 డ్రోన్లు సిద్ధం..

## ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ జవాబు




**న్యూఢిల్లీ, జనవరి 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికా సైనిక హెచ్చరికలు పెరుగుతున్న నేపథ్యంలో తన రక్షణ సామర్థ్యం గురించి ఇరాన్ గట్టిగా బదులిచ్చింది. భూ ఉపరితలం, సముద్రంపై నుంచి ప్రయోగించగల వెయ్యి డ్రోన్లను సిద్ధం చేసినట్లు ఇరాన్ సైన్యం శుక్రవారం ప్రకటించింది. అమెరికా యుద్ధనౌకలు ఇరాన్ వైపు పయనిస్తున్నాయని, ఇరాన్‌పై కఠిన చర్యలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన దరిమిలా ఇరాన్ సైన్యం ఈ వ్యాఖ్యలు చేసింది.తమపై అమెరికా దాడి ప్రారంభిస్తే తమ దేశాన్ని కాపాడుకోవడంలో డ్రోన్లు, క్షిపణులతో కూడిన ఈ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందని సైనికాధికారులు తెలిపారు.

# 11 మంది సైబర్ నేరగాళ్లకు చైనా ఉరి



**బీజింగ్ – జనవరి 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మయన్మార్‌లోని ఆన్‌లైన్ స్కామ్ సెంటర్లతో సంబంధం కలిగి ఉన్న 11 మందిని చైనా ఉరి తీసింది. తమ దేశ పౌరులను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న మోసాలపై ఈ మేరకు కఠిన చర్యలు తీసుకున్నది. ఇదే కేసులో మరో 23 మంది అనుమానితులకు ఐదేండ్లు మొదలుకొని జీవిత ఖైదు వరకు జైలు శిక్ష విధించింది. 'ఉద్దేశపూర్వక హత్యలు, గాయపరచడం, చట్టవిరుద్ధ నిర్బంధం, మోసం, జూద గృహాల స్థాపన వంటి నేరాలను పరిగణనలోకి తీసుకొని దోషులకు ఉరి శిక్ష అమలైంది' అని చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది

# లొంగిపోయిన నలుగురు మావోయిస్టులు



**సుక్మా – జనవరి 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తమ ఆయుధాలతో సహా నలుగురు మావోయిస్టులు లొంగిపోయినట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారని, ఒకొక్కరిపై మొత్తంగా రూ.8లక్షల రివార్డు ఉందని అన్నారు. వారు మావోయిస్టుల దక్షిణ బస్తర్ డివిజన్ కిస్టారం ఏరియా కమిటీకి చెందిన వారని అన్నారు.
లొంగిపోయిన వారిలో ఏరియా కమిటీ సభ్యురాలు సోధి జోగాపై రూ.5లక్షల రివార్డు ఉందని, మిగిలిన వారు దాదర్‌గంగా అలియాస్ మడ్కమ్ గంగా, సోధి రాజె, మాద్వి బుధారిలపై లక్షరూపాయల చొప్పున రివార్డు ఉందని ఆ అధికారి తెలిపారు. సింగిల్ లోడింగ్ రైఫిల్ (ఇన్సాస్ రైఫిల్), 303 రైఫిల్, 315 రైఫిల్‌లతో పాటు మందుగుండు సామాగ్రిని పోలీసులకు అప్పగించారని సుక్మా జిల్లా పోలీస్ అధికారి అల్లూరి సీతారామ రాజు వెల్లడించారు. ఈ నలుగురితో కలిపి ఈ ఏడాదిలో లొంగిపోయిన మొత్తం మావోయిస్టుల సంఖ్య 200కి చేరింది. జనవరి 15న బీజాపూర్ జిల్లాలో సుమారు 52మంది మావోయిస్టులు లొంగిపోయిన సంగతి తెలిసిందే.

# సందడిగా కరీంనగర్ కార్పొరేషన్ చివరి రోజు











**కరీంనగర్ ,జనవరి 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ల చివరి రోజు కార్యాలయాలు సందడిగా మారాయి. మాజీ కార్పొరేటర్ కొలిపాక అంజయ్య కోడలు కొలిపాక రమ్యశ్రీ--శ్రీనివాస్ 57వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మారుతినగర్ 36వ డివిజన్ నుండి ధనపురి స్వర్ణలత సాగర్, లక్ష్మి నగర్ 38వ డివిజన్ నుండి వోల్లాల శ్రీదేవి శ్రీనివాస్ గౌడ్, 63వ డివిజన్ నుండి రెడ్డెడ్డి శ్రీనివాస్ (బాలు), 66వ డివిజన్ నుండి కలికోట మోహన్ నామినేషన్లు దాఖలు చేశారు.చివరి రోజు కావడంతో పోటీదారులు పెండింగ్ బకాయిలు చెల్లించుకుని అవసరమైన ఎన్ఓసీలు పొందారు. కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్ అభ్యర్థులు రంగంలోకి దిగడంతో కార్యాలయాలు రద్దీగా మారాయి.




# పెండ్లిపోరు గుట్ట పై వన దేవతలకు మొక్కుబడులు.



ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్ కుటుంబ సభ్యులతో కలసి అమ్మవార్లను దర్శించుకుని బంగారం మొక్కులు చెల్లించుకున్నారు గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ వన దేవతలను కోరుకున్నారు .



ముక్కులు చెల్లించుకుంటున్న భక్తులు.

**ఎలిగేడు, జనవరి 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మండలంలోని లాలపల్లి-ఎలిగేడు గ్రామాల మధ్యన్ను పెండ్లి పోరుగుట్ట వద్ద జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సమ్మక్క-సారలమ్మలు గద్దెలపై కొలువై ఉండటంతో భక్తులు అమ్మవారికి పసుపు.కుంకుమలు ఓడి బియ్యంనుపోసి బంగారం(బెల్లం)ను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. జాతర, భక్తుల సౌకర్యాలపై తహీల్దార్ యాకయ్య. ఎంపీడీవో బాస్కర్రావు, పంచాయతీ కార్యదర్శి అంజలిలు పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకట్రెడ్డి. రంగు లత-శ్రీనివాస్ గౌడ్, ఎలిగేడు ఉప సర్పంచ్ ముంజం నరేష్, కెడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొక్కిరాల మహేశ్వర రావు , జడ్పీ చైర్ పర్సన్ బండిగా రేణుక రాజ నరసయ్య, మాజీ ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మీ దుర్గయ్య,సింగిల్విండో చైర్మెన్ గోపు విజయబాస్కర్రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు సాగర్, ఉపాధ్యక్షులు అడ్డగుంట రవి గౌడ్, కోశాధికారి కుమార్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎలిగేడు లాలపల్లి గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# చంద్రబాబు కోసం బండ్ల గణేష్ సంకల్ప పాదయాత్ర


## -శిరివెళ్ళ వద్ద యాత్రకు సంఘీభావం తెలిపిన యామ గురప్ప

**ఆళ్లగడ్డ జనవరి 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రముఖ టాలీవుడ్ నిర్మాత , నటుడు బండ్ల గణేష్ చేపట్టిన షాద్‌నగర్ నుంచి తిరుమల వరకు సాగుతున్న సంకల్ప పాదయాత్రకు టీడీపీ శ్రేణుల నుంచి విశేష మద్దతు లభిస్తోంది.
చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ కొనసాగుతున్న ఈ యాత్ర పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సంకల్ప పాదయాత్ర శిరివెళ్ళకు చేరుకున్న సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు , మాజీ



జడ్పీటీసీ యామ గురప్ప సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన బండ్ల గణేష్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.చంద్రబాబు నాయుడు నాయకత్వం రాష్ట్రాభివృద్ధికి ఎంతో కీలకమని , ఆయన తిరిగి అధికారంలోకి వచ్చినందుకు ప్రజలంతా సంతోషంగా ఉన్నారని యామ గురప్ప పేర్కొన్నారు.ఆ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఈ పాదయాత్ర విజయవంతంగా పూర్తై చంద్రబాబు నాయుడుకు మరింత ప్రజాబలం చేకూరాలని యామ గురప్ప ఆకాంక్షించారు.బండ్ల గణేష్ చేపట్టిన ఈ సంకల్ప యాత్ర పార్టీ శ్రేణుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంచి , కొత్త ఉత్సాహాన్ని అందిస్తోందని యామ గురప్ప అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో మండల ఉపాధ్యక్షులు కొండబోయిన బాలచంద్రుడు , తెదేపా నాయకులు యామ శ్రీకాంత్ , కటకం శేఖర్ , ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# అల్లు అర్జున్ జోడీగా శ్రద్ధా కపూర్?..

## లోకేష్ కనగరాజ్ భారీ ప్లాన్.!

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే.ఆఆ23 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే పట్టాలెక్కబోతుంది. అయితే ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇటీవల 'స్త్రీ 2' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న శ్రద్ధా, గతంలో ప్రభాస్ సరసన 'సాహో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు అల్లు అర్జున్‌తో జతకట్టడం ద్వారా మరోసారి టాలీవుడ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేయబోతోందని సినీ వర్గాలు అంటున్నాయి.లోకేష్ కనగరాజ్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు తక్కువ ప్రాధాన్యత ఉంటుందనే అభిప్రాయం ఉన్నప్పటికీ, ఈ సినిమాలో శ్రద్ధా పాత్ర ఎంతో కీలకంగా మరియు పవర్‌ఫుల్‌గా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ సినిమాతో బిజీగా ఉండగా ఈ సినిమా పూర్తయిన అనంతరం లోకేష్‌తో సినిమా చేయబోతున్నాడు. ఈ ఇద్దరు దిగ్గజాల కాంబోలో రాబోతున్న సినిమా 'లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా ఉంటుందా లేక సోలో ప్రాజెక్టా అన్నది తెలియాల్సి ఉంది. ఈ క్రేజీ అప్‌డేట్‌తో అల్లు అభిమానులు, సినీ ప్రేమికులు ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు.

# తిరువీర్ 'భగవంతుడు' టీజర్ విడుదల




టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది. పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళీధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.

# ఇండస్ట్రీలో చక్రం తిప్పుతున్న త్రిష..

## ఎంత సంపాదించిందంటే..



రెండు దశాబ్దాలుగా దక్షిణ వెండితెరపై తిరుగులేని స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతుంది అందాల తార త్రిష. అంతే కాదు తెలుగు, తమిళం భాషలలో బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరిస్తుంది. చాలా మంది కొత్త నటీమణులు వచ్చినప్పటికీ, త్రిష క్రేజ్ తగ్గలేదు.త్రిష తన గ్లామర్, నటనకు మాత్రమే కాకుండా, సంపాదన పరంగా కూడా అగ్రస్థానానికి చేరుకుంటోంది. ఈ అందాల రాణి ఆస్తులు , విలాసవంతమైన జీవనశైలి విలువ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.1999 నుండి చిత్ర పరిశ్రమలో విజయం సాధించిన త్రిష, ఆస్తుల పరంగా కూడా తెలివైన ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఆమె మొత్తం ఆస్తులు దాదాపు రూ. 85 కోట్లు ఉన్నట్లు సమాచారం.ముఖ్యంగా బ్లాక్ బస్టర్ "పొన్నియిన్ సెల్వన్" తర్వాత, ఆమె తన పారితోషికాన్ని భారీగా పెంచుకుంది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష ప్రస్తుతం ఒక్కో సినిమాకు దాదాపు రూ. 5 కోట్లు పారితోషికం తీసుకుంటుంది.ఆమె కార్ల జాబితాలో దాదాపు రూ. 80 లక్షల విలువైన మెర్సిడెస్-బెంజ్ ఎస్-క్లాస్, రూ. 75 లక్షల విలువైన బిఎమ్‌డబ్ల్యూ 5-సిరీస్, రూ. 60 లక్షల విలువైన రేంజ్ రోవర్ ఎవో, రూ. 63 లక్షల విలువైన మెర్సిడెస్-బెంజ్ ఇ-క్లాస్ ఉన్నాయి.



# రజనీ, కమల్ మల్టీస్టారర్ మూవీ

## జైలర్ డైరెక్టర్ చేతికి ప్రాజెక్ట్ ?

ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ ? కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది.

# 'కల్కి 2'లో సాయిపల్లవి?



'కల్కి 2898ఏడీ'లో దీపికా పడుకొనే పోషించిన 'సుమతి' పాత్ర చాలా కీలకం. ఓ విధంగా కథంతా ఆ పాత్ర చుట్టూనే తిరుగుతుంది. రెండో భాగంలో ఆ పాత్ర ప్రాధాన్యత మరింత ఎక్కువగా ఉంటుందట. అయితే.. దీపికాను ఆ సినిమా నుంచి తప్పించిన విషయం తెలిసిందే. మరి ఇప్పుడు 'కల్కి 2'లో సుమతిగా ఎవరు కనిపిస్తారు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.అలియాభట్ ఆ పాత్రకు ఎంపికైనట్టు గతంలో వార్తలు వచ్చాయి. అయితే.. అందుతున్న తాజా సమాచారం ప్రకారం ఆ పాత్రకు సాయిపల్లవిని తీసుకున్నట్టు తెలిసింది. ఇటీవలే సాయిపల్లవికి దర్శకుడు నాగ్‌అశ్విన్ పాత్రను వివరించారని, ఆమె కూడా సుమతిగా కనిపించేందుకు ఉవ్విళ్లూరుతున్నదని ఇన్‌సైడ్ టాక్. కల్కికి జన్మనిచ్చే క్రమంలో సుమతి అనుభవించే కష్టాలు, వాటి చుట్టూ నిండిన పురాణ నేపథ్యమే ఈ సినిమా కథ. మరి ఈ వార్తలో నిజం ఎంతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.